క్లుప్తంగా

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లి సింహాచలం

దాబాగార్డెన్స్ : ఈ నెల 27న సంగివలసలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 36, 38, 39 వార్డుల మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం పిలుపునిచ్చారు. లక్ష్మీ టాకీస్ జంక్షన్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సభ విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి సనపల రవీంద్రభరత్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో జి.వి.రమాబాయి, భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, పాలాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పసుపు నీటితో భక్తులు జలాభిషేకం చేశారు. నూతన చీర, పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

తాండ్ర పాపారాయుడుకు ఘన నివాళి



తాండ్రపాపారాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బీచ్ రోడ్డు: తాండ్ర పాపారాయుడు 267వ వర్ధంతి సందర్భంగా వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం బీచ్ రోడ్డులోని పాపారాయుడు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, బర్ల పైడంనాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, లగుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ మీరొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు తప్పనిసరిగా వెంట ఉండాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.వి.భాస్కరరావు అన్నారు. బుధవారం స్టేషన్ పరిధిలోని గురుద్వారా, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నేషనల్ హైవే తదితర ప్రాంతాల జంక్షన్లలో ఆటో డ్రైవర్లకు ద్వారకా పోలీసులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క డ్రైవర్ యూనిఫారం ధరించాలని, మద్యం తాగి ఆటో నడపరాదని సూచించారు. అతి వేగంగా ఆటోలు నడపరాదని, అతిగా లోడ్ ఎక్కించ వద్దని చెప్పారు. సిగ్నల్ వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తే చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ హెచ్చరించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు

ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు విద్య, వైద్యం అందించేందుకు కంకణం కట్టుకున్నారు. అందులో భాగంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు విశేష ఆదరణ లభిస్తోంది. నియోజకవర్గంలోని దొండపర్తి, ప్రసాద్‌గార్డెన్స్‌లో జరిగిన సురక్ష వైద్య శిబిరానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరై ఉచిత సేవలు, మందులు అందుకున్నారు. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది చక్కటి సేవలందించారని.. జగనన్న మంచి కార్యక్రమం రూపొందించారని కొనియాడారు.

- దొండపర్తి, ప్రసాద్‌గార్డెన్స్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల నిర్వహణ
- దొండపర్తిలో 100 మందికి, ప్రసాద్‌గార్డెన్స్‌లో 518 మందికి సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



దొండపర్తి శిబిరంలో రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది



దొండపర్తి పీహెచ్‌సీలో ఉచిత మందుల పంపిణీ



దొండపర్తి పీహెచ్‌సీలో సేవలందిస్తున్న వైద్యాధికారి శ్రావణి



ప్రసాద్‌గార్డెన్స్ శిబిరంలో వృద్ధురాలికి బీపీ పరీక్షిస్తున్న ఏఎన్ఎం



దొండపర్తి శిబిరంలో ప్రత్యేక కౌంటర్ ద్వారా టీబీ రోగులకు మందుల అందజేత

సీతమ్మధార : జగనన్న ఆరోగ్య సురక్ష వరమని, ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని దొండపర్తి పీహెచ్‌సీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా ఉచిత వైద్య సేవలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్న ప్రతి ఒక్కరినీ పరామర్శించారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాణ్యమైన వైద్యం, ఖరీదైన మందులు అందజేస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రావణి మాట్లాడుతూ ఉచితంగా ఏడు రకాల టెస్ట్‌లు, 172 రకాల మందులు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే టీబీ వ్యాధికి ఉచితంగా మందులు, టెస్ట్‌లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థో రాకేష్, కార్డియాలజిస్ట్ రూప, అప్తాల్మిక్‌తో పాటు సచివాలయ కన్వీనర్లు మధు, అంగటి కుమారి, మల్లేశ్వరి, గృహసారథులు పేకేటి లక్ష్మి, పెద్దాడ రమణ, పొన్నాడ త్రినాథ్, గంట్యాడ రామారావు, గుడ్ల బాబ్జీ, పద్మనాభం రాజా తదితరులు పాల్గొన్నారు.



ప్రసాద్‌గార్డెన్స్ శిబిరంలో రోగుల వివరాలు నమోదు చేస్తున్న ఏఎన్ఎం



ప్రసాద్‌గార్డెన్స్ శిబిరంలో రోగులకు మందులిస్తున్న సిబ్బంది

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో..

జగదాంబ : గురువారం జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్‌గార్డెన్స్ సచివాలయానికి సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గతంలో పరీక్షలు చేయించుకున్నవారు, శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారంతా ఈ శిబిరంలో పాల్గొన్నారు. అలాగే కొత్తగా వచ్చిన రోగులకు కూడా పరీక్షలు చేసి వైద్యం అందించారు. ఉచిత మందులిచ్చారు. ఈ శిబిరంలో రక్త పరీక్షలు చేసి, బీపీ, షుగర్ తనిఖీ చేశారు. అవసరమైన వారిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ఈ శిబిరంలో 518 మందికి సేవలందించారు. వీరిలో 140 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని ప్రసాద్‌గార్డెన్స్‌లోని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సందేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎంలు, గృహసారథులు, కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు కృతజ్ఞతలు..



ప్రజారోగ్యానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు ఎంతో బాగున్నాయి. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పరీక్షలు, వైద్య సేవలు అందించే విధానం ఎప్పుడూ.. ఏ ప్రభుత్వం అవలంబించలేదు. వయసుతో పని లేకుండా జగనన్న సురక్ష అందరికీ ఎంతో లబ్ధి చేకూరుస్తోంది. జగనన్నకు కృతజ్ఞతలు.

– సుగుణ, దొండపర్తి

ఉచిత వైద్య సేవలు భేష్..



దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చక్కటి సేవలందిస్తున్నారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, మంచి మందులు అందిస్తూ పేదల ఆరోగ్యం కోసం జగనన్న తీసుకుంటున్న శ్రద్ధ అద్భుతం. ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఉపయోగించుకోవాలి.

– ఎ. మంజు, దొండపర్తి

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'

- నియోజకవర్గ స్థాయి క్రీడలను ప్రారంభించిన ఎమ్మెల్యే వాసుపల్లి



బ్యాటింగ్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెల్యే వాసుపల్లి, ఆర్డీవో హుస్సేన్

జగదాంబ : ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ ఉద్దేశ్యమని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డు ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి, జిల్లా స్పోర్ట్స్ అధికారి, ఆర్డీవో హుస్సేన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. జోనల్ స్థాయిలో కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 15 టీమ్‌లు 20 మ్యాచ్‌లు ఆడతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లాస్థాయికి ఎంపికవుతారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి బ్యాటింగ్ చేసి యువతను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు తగదు'

అల్లిపురం : నూట యాభై ఏళ్ల వెంకటేశ్వరమెట్ట సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కృషి చేయడం 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, జనసేన నాయకులకు మింగుడు పడటం లేదని నీలమ్మ వేపచెట్టు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ఆరు నెలలుగా ఈ సమస్య పరిష్కారానికి కలెక్టర్, దేవదాయ శాఖ అధికారులు, ఆ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి కార్యదర్శుల వద్దకు వ్యక్తిగతంగా వెళ్లి తీవ్రంగా శ్రమిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లిపై సోషల్ మీడియా వేదికగా విమర్శలు గుప్పించటం తగదన్నారు. సమస్య పరిష్కరించడానికి కృషి చేయకపోగా ప్రయత్నిస్తున్న వారిని విమర్శించడం సరి కాదన్నారు. కార్పొరేటర్‌గా వార్డు సమస్యలపై దృష్టి పెట్టి, అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ట్రస్ట్ బోర్డులో అన్యమతస్తులు ఎవరూ లేరన్నారు. ముందు అది తెలుసుకుని పోస్టులు పెట్టాలని, ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు

మహారాణిపేట : జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాలకు సంబంధించి 60:40 నిష్పత్తిలో కాకుండా ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం ఉచితంగా లేదా నామమాత్రపు ధరకు ఇవ్వాలని జర్నలిస్టు సంఘాలు కోరాయి. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్‌కు జర్నలిస్టుల సంఘాల ప్రతినిధులు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. విశాఖ జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టులకు తొలి ప్రాధాన్యత ఇచ్చిన తర్వాతే స్టేట్ హెడ్ క్వార్టర్‌లో పని చేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకోవాలని లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్‌పీ) అధ్యక్షుడు పి.సత్యనారాయణ కోరారు. 2023లో అక్రిడేషన్ లేనప్పటికీ గతంలో కలిగి ఉంటే వారికి కూడా స్థలాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కరోనాతోనూ, ఆ తర్వాత మరణించిన జర్నలిస్టుల తరపున వారి కుటుంబాలకు స్థలాలు కేటాయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ఎన్‌పీ) అధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి కె. చంద్రమోహన్, ఎల్ఎన్‌పీ కోశాధికారి ఆర్.అబ్బాస్, ప్రతినిధులు బండారు శివప్రసాద్, బిపి నాయుడు, ఏపీజేయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శ్రీధర్, ఎం. శ్రీహరి, ఎస్.మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవోకి కూడా వినతిపత్రం అందజేశారు.

'గైస్' విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత



ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ, ఇతర అధ్యాపకులతో కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు

మురళీనగర్: రాష్ట్ర సాంకేతిక శాఖ నిర్వహించిన ఫైనల్ ఇయర్ పరీక్షల్లో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ (గైస్) విద్యార్థులు రికార్డు సృష్టించారు. పాలిటెక్నిక్ డిప్లమా పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. కెమికల్ ఇంజినీరింగ్ డిప్లమా 7వ సెమిస్టర్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. 2020–23 బ్యాచ్ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు 61 మంది పరీక్షలకు హాజరు కాగా.. 61 మంది ఉత్తీర్ణత సాధించారు. కాలేజీ స్థాపించిన తర్వాత ఇలా నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం ఇదే మొదటిసారని ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటరమణ చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటరమణ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయలక్ష్మి, బి.హేమేంద్ర ప్రదీప్‌కుమార్, ఎల్.గీతిక బుధవారం అభినందించారు.

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సొంత గనులతోనే స్టీల్‌ప్లాంట్ బలోపేతం



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, సొంత గనులు కేటాయించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న 1028వ రోజు దీక్షలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను భేషరతుగా ఆపాలన్నారు. ప్రభుత్వ రంగంలోనే స్టీల్‌ప్లాంట్ కొనసాగుతుందని నేరుగా ప్రధాని మోదీ ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించేందుకు జీవీఎల్ మోదీ ప్రభుత్వానికి దూతగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీక్షలో ఎస్.శ్రావణి, కె.కుమారి, కృష్ణారావు, శివ, వెంకటరావు, వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ శాఖలు సెస్ బకాయిలు చెల్లించాలి

జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్

మహారాణిపేట: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు కార్మిక శాఖకు చెల్లించాల్సిన సెస్ బకాయిలను ఈ నెలాఖరులోగా చెల్లించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఆదేశించారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం – వర్కర్స్ చట్టంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం ఆయన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ రహదారులు, భవనాల శాఖ, జీవీఎంసీ, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్, గంగవరం పోర్టు, ఇతర ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన బకాయి సెస్ ఈ నెల 30లోగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖాధికారులను ఆదేశించారు. జీవీఎంసీలో 2018 నుంచి ఆన్‌లైన్ ద్వారా సెస్ చెల్లింపులు జరుగుతున్నాయని, అయితే అంతకు ముందు ఆమోదించిన భవన నిర్మాణాల వివరాలను కార్మిక శాఖ ఉప కమిషనర్ కోరగా, 2016 నుంచి 2018 వరకు గల వివరాలను ఈ నెలాఖరులోగా అందజేయాలని ఆదేశించారు. సచివాలయం పోర్టల్ ద్వారా ప్రభుత్వ భవన నిర్మాణాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉందని కార్మిక శాఖ ఉప కమిషనర్ జాయింట్ కలెక్టర్‌కు వివరించగా, ఇకపై రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎం.సునీత, సహాయ కమిషనర్ ఎస్.మోహనలక్ష్మి, డీపీవో ఎంవీఏ.శ్రీనివాసరావు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ సీహెచ్.గణపతి, సహాయ కార్మిక అధికారులు పీటీవీ లవకుమార్, ఎస్.విజయ శ్రీ, ఆర్ అండ్ బీ డీఈఈ కె.ఎస్.ఫణీశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న అరుణోదయ కళాసమితి ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మిందికి చెందిన అరుణోదయ కళాసమితి ప్రతినిధులు విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. గ్రామానికి చెందిన రెడ్డిపల్లి అశోక్ ఆర్థిక సహాయంతో మింది జిల్లా పరిషత్ పాఠశాలలో 15 మంది విద్యార్థులకు రూ.30 వేలు నగదు ప్రోత్సాహకాలతో పాటు పాఠశాలకు 15 కుర్చీలు, ఆయాలకు చీరలు అందజేశారు. కార్యక్రమంలో కళాసమితి ప్రతినిధులు రెడ్డిపల్లి నానాజీ, వర్రి వెంకటరావు, అప్పలరాజు, పాఠశాల హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న ఏఈవో నరసింగరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం గోపాలపట్నానికి చెందిన బొప్పన వాణి అనే దాత రూ. లక్షా 1116 విరాళం నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు అన్నప్రసాద పథకం ఏఈవో పాలూరి నరసింగరావు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు. ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

చిత్రలేఖనంలో విద్యార్థులకు బంగారు పతకాలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న హెచ్ఎం విజయ ప్రశాంతి తదితరులు

గాజువాక: అమీర్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఆలిండియా చిల్డ్రన్ ఆర్ట్ కాంపిటీషన్‌లో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. హైస్కూల్ నుంచి ఈ పోటీలకు 54 మంది విద్యార్థులు హాజరు కాగా, ఏడుగురికి బంగారు పతకాలు, మిగిలిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు లభించినట్లు చిత్రలేఖన ఉపాధ్యాయుడు భావనా రుషి తెలిపారు.

ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.విజయ ప్రశాంతి విద్యార్థులకు పతకాలను, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం వెలమలకు సీట్లు కేటాయించాలి

సీతంపేట: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం వెలమ సామాజిక వర్గానికి అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం సీతంపేట మెయిన్ రోడ్‌లోని ఒక హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్తరాంధ్రలో 50 లక్షలకు పైగా ఉన్న వెలమ సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యమివ్వాలని కోరారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, వివిధ జిల్లాల, రాష్ట్ర స్థాయి నాయకులు బర్ల పైడం నాయుడు, పెదిరెడ్ల శ్రీనివాస్, లగుడు శ్రీనివాస్, పి.మల్లయ్య దొర, బోదంకి రమణ, మంత్రబుద్ధి అనంతకుమార్, కరక రమణ పాల్గొన్నారు.

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎర్నాకుళం – బ్రహ్మపూర్ – ఎర్నాకుళం మధ్య సాధారణ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. ఎర్నాకుళం – బ్రహ్మపూర్ (06087) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ జనవరి 27, ఫిబ్రవరి 3, 10, 17, 24న (శనివారాల్లో) ఎర్నాకుళంలో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 11.07 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్ – ఎర్నాకుళం (06088) అన్ రిజర్వ్‌డ్ స్పెషల్ జనవరి 29, ఫిబ్రవరి 5, 12, 19, 26న బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడి నుంచి 6.07 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 9.40 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. ఈ రైళ్లు 22 జనరల్ సెకండ్ క్లాస్, 2 సెకండ్ క్లాస్ కం లగేజీ కం దివ్యాంగ కోచ్‌లతో నడుస్తాయి.

యూజీసీ నెట్ పరీక్షలో మజ్జిపేట ఉపాధ్యాయునికి ఫస్ట్ ర్యాంక్



అప్పలరాజును అభినందిస్తున్న తోటి ఉపాధ్యాయులు

తగరపువలస: భీమిలి మండలం మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన సైన్స్ ఉపాధ్యాయుడు ముగదాల అప్పలరాజుకు యూనివర్శిటీ గ్రాంట్ కమిషన్ నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2023 – 2024 ప్రవేశ పరీక్షలో ఫస్ట్ ర్యాంక్ లభించింది. ఇతనికి 300 మార్కులకు 238 లభించాయి. చిట్టివలస కార్మికవాడకు చెందిన అప్పలరాజు తగరపువలసలో ఫర్ యువర్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు. ఆర్థిక సమస్యల కారణంగా ఫీజులు చెల్లించుకోలేని, పుస్తకాలు కొనలేని విద్యార్థుల కోసం ఈ సొసైటీ స్థాపించారు. ఈ సందర్భంగా బుధవారం అప్పలరాజును సొసైటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.